
సాక్షి అనంతపురం

గురువారం । 14 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.34, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.3°/21.5°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

లోటుపాట్లకు తావివ్వొద్దు



అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: పంద్రాగస్టు పండుగ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వొద్దని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను ఇన్‌చార్జ్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్, పోలీసు బందోబస్తుపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవం-2025 పురస్కరించుకుని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు ఈనెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారం ఎం.ప్రసాద్‌బాబు సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల క్రీడా ఫలితాల ఆధారంగా జిల్లాలో ఐదు పాఠశాలలకు ఉత్తమ అవార్డులు అందజేస్తామన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ప్రదర్శనలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గేమ్స్, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు (హెచ్ఎం, ఎస్ఏ (పీఈ), పీఈటీ సంతకంతో) జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. టీం ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్లు అనుబంధంలో ఇచ్చిన విధంగా పరిగణిస్తారన్నారు. ప్రతి క్రీడలో అత్యధిక స్కోరు సాధించిన పాఠశాలలు, మొత్తం స్కోరులో అగ్రస్థానంలో ఉన్న పాఠశాలలు అవార్డుకు అర్హులని తెలిపారు. డీఈఓ అధ్యక్షతన ఐదుగురి కమిటీ దరఖాస్తులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడా దినోత్సవం రోజున (ఈనెల 29) అవార్డులు అందజేస్తామని తెలిపారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా నారాయణస్వామి



నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి

అనంతపురం అర్బన్: సీపీఐ జిల్లా కార్యదర్శిగా పి.నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా సహాయ కార్యదర్శులుగా చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డిని ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా మహాసభలు రెండో రోజు బుధవారం స్థానిక కనకదాస ఫంక్షన్ హాలులో నిర్వహించారు. సభల ముగింపు సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నారాయణస్వామి విద్యార్థి దశ నుంచి సీపీఐలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ శాఖల్లో వివిధ పదవులు నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా దాదాపు ఆరేళ్లు ఉన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ




మాట్లాడుతున్న న్యాయవాదులు

అనంతపురం: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని న్యాయవాదులు విమర్శించారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు సి. హనుమన్న, బాలాజీ నాయక్, ఎం. కృష్ణప్ప, ఎం. శ్రీనివాసులు, లక్ష్మణ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీ ఎన్నికలను ఏకపక్షంగా రిగ్గింగ్ చేసుకుందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు సంబంధించి ఏజెంట్లు కూడా లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి దాసోహం అయిందని, పోలీసులను మహిళలు నిలదీసి, కాళ్లు పట్టుకున్నా ఓటు వేయడానికి అంగీకరించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. వెంటనే కేంద్ర బలగాల భద్రతతో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీట్లు ఫుల్.. అడ్మిషన్లు డల్

- జిల్లాలో ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు విద్యార్థుల అనాసక్తి
- 'స్థానికత'పై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో దుస్థితి
- పొరుగు రాష్ట్రాల్లోని కళాశాలల్లో చేరడానికే మొగ్గు





రాప్తాడుకు చెందిన ఫణి కుమార్ కుమార్తె భావనకు ఏపీఈఏపీసెట్‌లో 17 వేల ర్యాంకు వచ్చింది. అయితే, భావన ఇంటర్ తెలంగాణలో చదవడంతో రాష్ట్ర అధికారులు 'స్థానికేతరుల' జాబితాలో చేర్చారు. దీంతో ఏపీఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు దక్కినప్పటికీ రాష్ట్రంలో భావన కోరుకున్న కళాశాలలో సీటు దక్కలేదు. దీనికితోడు నాన్ లోకల్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలియడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది. ఈ అమ్మాయి ఒక్కరే కాదు.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది మంది విద్యార్థులు పొరుగు రాష్ట్రాల్లో బీటెక్ అడ్మిషన్లు పొందడం గమనార్హం.

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 13 వేల ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో తొలి విడత ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో 9 వేల సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా నాలుగు వేల సీట్లు భర్తీ కావాల్సి ఉంది.

ఫీజులతో బాదుడే బాదుడు..

తొలి విడతలో సీట్లు దక్కిన విద్యార్థులు తక్షణమే కళాశాలలో చేరాలి. లేదంటే సీటు రద్దవుతుందంటూ యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి కూడా యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయి. బిల్డింగ్, వర్సిటీ, ల్యాబ్ అంటూ ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేలు లాగుతున్నాయి. సాధారణంగా తొలి విడత కౌన్సెలింగ్‌లో నచ్చిన కళాశాలలో లేదా మెచ్చిన కోర్సులో సీటు రాని విద్యార్థులు రెండో దఫా కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తారు. అయితే, తొలి విడత సీటు వచ్చిన కళాశాలలో ఆయా ఫీజులు చెల్లిస్తే, వేరే కళాశాలకు వెళ్లేటప్పుడు ఆ మొత్తం తిరిగి ఇవ్వబోమని యాజమాన్యాలు స్పష్టం చేస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అనుమానం..

కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పడుతున్నాయి. ఒకటి.. అర కాదు ఏకంగా ఆరు క్వార్టర్ల చెల్లింపులు పక్కన పెట్టడంతో విద్యార్థులు విసుగెత్తి చదువులు మానేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు బీటెక్‌ను రాష్ట్రంలో చదివే బదులు కర్ణాటక, తెలంగాణలో మంచి ఇంజినీరింగ్ కళాశాలలో చేరడం మేలని భావించి.. అక్కడ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఫలితంగా ఇక్కడ ఇంజినీరింగ్ సీట్లు భర్తీ కావడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం పుణ్యమా అని ఉన్నత విద్య భ్రష్టు పట్టిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

చేరాలా.. వద్దా..?

ఇటీవల ఏపీఈఏపీసెట్ రెండో కౌన్సెలింగ్‌కు సంబంధించి విద్యార్థులు పలు కళాశాలలకు ఆప్షన్ ఇచ్చారు. ఈ నెల మూడో తేదీనే కళాశాలలు కేటాయించాల్సి ఉంది. అయితే, తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణించడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం తీర్పు వెలువరించేంత వరకు రెండో దఫా కౌన్సెలింగ్ జరగదు. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లో సీటు వచ్చిన విద్యార్థులు తమకు సమీపంలో ఉండే కళాశాలలో సీటు కోసం ఎదురుచూడాలా.. లేక ఇప్పటికే సీటు దక్కిన కళాశాలలోనే బీటెక్ చదవాలా.. అనే సంశయంలో పడ్డారు.

2024 వరకు ఇబ్బంది లేదు..

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఉమ్మడి రాజధాని, ఉమ్మడి విద్యా వ్యవస్థ ఉండేది. తెలంగాణలో చదివినా, ఏపీలో చదివినా లోకల్‌గా పరిగణించేవారు. 2024 నుంచి ఈ నియమం తొలగించారు. దీంతో తెలంగాణలో చదివిన ఏపీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఏర్పడింది. అవగాహన లేక తమ పిల్లలను తెలంగాణలో ఇంటర్ చదివించిన తల్లిదండ్రుల బాధ నేడు వర్ణనాతీతంగా మారింది.

దివ్యాంగులతో చెలగాటం

అనంతపురం క్రైం: దివ్యాంగుల జీవితాలతో కూటమి సర్కారు చెలగాటమాడుతోంది. 'సదరం' సర్టిఫికెట్ల పునఃపరిశీలన పేరుతో జిల్లాలో ఏకంగా 1,588 మంది దివ్యాంగుల పింఛన్లను ఈ నెలలో నిలిపేసింది. ఇప్పటికే వందల మందిపై కక్షగట్టి పింఛన్లు తొలగించిన చంద్రబాబు ప్రభుత్వం..తాజాగా మరింతమంది పొట్ట కొట్టాలని చూస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో చాలా మంది పింఛన్లు నిలిపేసిన నేపథ్యంతో తాజాగా లబ్ధిదారులు వణికి పోతున్నారు.

అడ్డగోలు నిబంధనలు..

కూటమి అధికారంలో కొచ్చి 14 నెలలు కూడా కాలేదు. పింఛన్ల పంపిణీలో ఇప్పటికే మూడు సార్లు వడపోత పేరుతో ఇబ్బందులు పెట్టడం గమనార్హం. ఈ క్రమంలో మిగిలిన కాలంలో ఇంకా ఎన్నిమార్లు తనిఖీల పేరుతో పరీక్ష పెడతారో అంటూ లబ్ధిదారులు భయాందోళన చెందుతున్నారు. తమ పార్టీ కాదని, ఓటేయలేదని తదితర కారణాలు చూపుతుండడం దివ్యాంగులకు శాపంగా మారింది. అధికారంలోకి వచ్చాక డబుల్ పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కూటమి నేతలు నేడు ప్రతినెలా చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'నవోదయ'లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి (2026-27 విద్యా సంవత్సరం) దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థులు ఈనెల 27వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యంలో మునిగితేలుతున్నారు!



బ్రహ్మసముద్రం మండలంలోని గ్రామాలకు ప్రత్యేక వాహనంలో మద్యం సరఫరా చేస్తున్న దృశ్యం



బ్రహ్మసముద్రంలో ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బెల్టుషాపు

- నెలనెలా పెరుగుతూనే ఉన్న వినియోగం
- పల్లె పల్లెనా విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటు
- 11 మాసాల్లో రూ.1,550 కోట్ల విలువైన లిక్కర్ అమ్మకాలు
- 1.98 కోట్ల లీటర్ల మద్యం సేవనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ఊరూరా వెలసిన బెల్టుషాపులు మద్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసే స్థాయికి చేరాయి. నగరంలో వైన్‌షాపులు సమయం ప్రకారమే నడుచుకోవాలి. కానీ బెల్టుషాపులకు సమయమూ సందర్భమూ ఏమీ లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు అందిస్తారు. పల్లెల్లో ప్రస్తుతం ఏదైనా బాగా అందుబాటులో ఉందీ అంటే అది మద్యమేననే విమర్శలు వినిపిస్తున్నాయి.

కూరగాయల షాపుల కంటే ఎక్కువ

సాధారణంగా ఊరికి రెండు, మూడు కూరగాయల షాపులు.. మండల కేంద్రాల్లో అయితే పదిహేను, ఇరవై వరకూ అందుబాటులో ఉంటాయి. కానీ రాప్తాడు నియోజకవర్గంలోని 1,500 జనాభా ఉండే బండమీదపల్లెలో 15 నుంచి 20 వరకూ బెల్టుషాపులున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పాల వ్యాన్‌లు ఎలా అయితే షాపులకు పాలు వేస్తూ వెళతాయో అదే తరహాలో బెల్టుషాపులకు మందు సరఫరా చేయడానికి వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో ఏ ఊరికెళ్లినా పట్టపగలే రోడ్డుమీద మద్యం పెట్టి అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తాయి.

రూ.1,550 కోట్ల వినియోగం..

2024 సెప్టెంబర్ 15న కొత్త మద్యం పాలసీ వచ్చింది. అప్పటినుంచి ఈరోజు వరకూ అంటే 11 నెలల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.1,550 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందంటే ఎలా తాగుతున్నారో అంచనా వేయొచ్చు. ఈ 11 నెలల్లో 1.97 కోట్ల లీటర్ల మద్యం సేవించారు. బీర్ల సేవనం దీనికి అదనం. పట్టణాల్లో అయితే పర్మిట్ రూముల్లో మందుబాబులు మద్యంలో మునిగి తేలుతున్నారు.

మామూళ్లు మద్దయ్యకు తెలిసే..

మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఇందుకు నెలనెలా ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు వెళుతున్న విషయం తెలిసిందే.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం అమ్మకాలు ఇలా

అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం	1,21,48,578 (లీటర్లు)
ఈ మద్యం వినియోగం విలువ	రూ.962,16,68,299
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం వినియోగం	76,41,828 లీటర్లు
ఈ మద్యం వినియోగం విలువ	రూ.587,06,37,344
రెండు జిల్లాల్లో మద్యం వినియోగం	1,97,90,406 లీటర్లు
ఈ మొత్తం మద్యం వినియోగం విలువ	రూ.1549,23,05,643

(బీరు వినియోగం, విలువ దీనికి అదనం)

ఇదంతా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) నాగమద్దయ్యకు తెలిసే జరుగుతోందని ఒక ఎక్సైజ్ అధికారి చెప్పారు. 'మామూళ్ల సంగతి కిందిస్థాయి కాని స్టేబుల్‌కే తెలిసినప్పుడు డీసీకి తెలియకుండా ఉంటుందా?' అనే చర్చ జరుగుతోంది. దీనిపై డీసీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఉపాధ్యాయులకే 'పరీక్ష'

- కొత్త విధానంలో 'ఫార్మేటివ్ అసెస్‌మెంట్' పరీక్షలు
- బడిలో మూల్యాంకనం చేసేందుకు సమయం సరిపోదంటున్న టీచర్లు
- కూటమి ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలపై మండిపాటు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈసారి కొత్తగా 1-10 తరగతుల విద్యార్థులకు అన్ని పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం పుస్తకాలు ఇవ్వడంపై సామాన్య ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో పిల్లలు తెల్లకాగితాల్లో పరీక్షలు రాస్తే... వాటిని టీచర్లు ఇంటికెళ్లి మూల్యాంకనం చేసేవారు. నాలుగైదు రోజులైనా ఇంటివద్దే సమయం కేటాయించుకని జవాబు పత్రాలు దిద్దేవారు. ఈ క్రమంలో బడిలో పిల్లల బోధనకు ఎలాంటి ఆటంకం కలిగేది కాదు. తాజాగా ఇచ్చిన మూల్యాంకనం పుస్తకాల్లోనే పిల్లలు జవాబులు రాయాల్సి ఉంది. ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఎఫ్ఏ-1 పరీక్షలు బుధవారం నాటికి 1-7 తరగతుల విద్యార్థులకు ముగిశాయి. 8,9,10 తరగతులకు గురువారం ఉదయం జరిగే బయాలజీ పరీక్షతో ముగుస్తాయి. జిల్లాలో మొత్తం 1,785 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,94,250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరూ ఎఫ్ఏ-1 పరీక్షలు రాస్తున్నారు.

ఇంటికి తీసుకెళ్లలేం..

ఎఫ్ఏ-1,2,3,4 పరీక్షలు, ఎస్ఏ-1,2 పరీక్షలన్నీ మూల్యాంకనం పుస్తకాల్లోనే రాయాలి. 1,2 తరగతుల విద్యార్థులకు మూడు పుస్తకాలు, 3,4,5 తరగతులకు నాలుగు పుస్తకాలు, 6,7 తరగతులకు ఆరు పుస్తకాలు, 8,9,10లకు ఏడు పుస్తకాల చొప్పున అందజేశారు. జిల్లాకు సుమారు 10 లక్షలకు పైగా మూల్యాంకనం పుస్తకాలు సరఫరా చేశారు. ఏడాదంతా జరిగే పరీక్షలన్నింటికీ మూల్యాంకనం ఈ పుస్తకాల్లో చేయాల్సి ఉంటుంది. తక్కువ విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలకు పెద్ద ఇబ్బంది ఉండదుకాని, వందలాది, వేలాది మంది విద్యార్థులున్న పాఠశాలల టీచర్లకు 'పుస్తకాల మూల్యాంకనం' తలనొప్పిగా మారనుంది. వీటిని ఇళ్లకు తీసుకెళ్లలేరు, అలాగని బడిలో మూల్యాంకనం చేద్దామంటే చదువు పక్కన పెట్టేసి వాటిని దిద్దుకుంటూ కూర్చోవాలని చెబుతున్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ఎటొచ్చి పిల్లలకు నష్టం కల్గించేలా ఉందని వాపోతున్నారు. విద్యార్థులకు ఏమోకాని గురువులకు అసలైన 'పరీక్ష' పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి

కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు వాపోయారు. బోధనేతర పనుల భారం మోపడం దారుణమన్నారు.అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం తీవ్ర గందరగోళానికి గురి చేస్తోందన్నారు. ఏడాది పొడవునా నిర్వహించే పరీక్షలను ప్రతి విద్యార్థి అదే పుస్తకంలో రాయాల్సి ఉండడం, ఎఫ్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలు సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల్లో పునరావృతం అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో చూచిరాతకు ఆస్కారం ఉంటుందన్నారు. పాఠశాలల్లో బుక్‌లెట్‌లను భద్రపరచడం తలకు మించిన భారమన్నారు. సంస్కరణలు విద్యా ప్రమాణాలు పెంచేలా ఉండాలి తప్ప, బోధనను హరించే విధంగా ఉండకూడదన్నారు. పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించేలా చూడాలని కోరారు.

ఉన్న వాటితో ఉచిత బస్సు సాధ్యమేనా?

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ కూటమి సర్కారు హడావుడిగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని హడలెత్తిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా నిత్యం 511 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. సగటున 1.20 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సంస్థకు సుమారు రూ.80 లక్షల ఆదాయం చేకూరుతోంది. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలైతే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతుంది. అయితే, అందుకు అనుగుణంగా సర్వీసులు లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు టెన్షన్‌కు గురవుతున్నారు. అనంతపురం రీజియన్‌కు కనీసం మరో 300 బస్సులు ఇవ్వగలిగితే ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆర్టీసీ సీనియర్ అధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

బస్సుల్లేవ్.. సిబ్బంది కొరత

ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో కూటమి సర్కారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అదనంగా బస్సుల కొనుగోలు, సిబ్బంది సంఖ్య పెంపు, వాహన సారథుల ఎంపిక చేపట్టనేలేదు. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులకు మరమ్మతులు చేయలేక గ్యారేజీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. గ్యారేజీలో తగినంత మంది లేక అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అంటుండడంతో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఎర్రబస్సెరుగని గ్రామాలు 120కి పైగానే..

జిల్లాలో ఇప్పటి దాకా ఎర్రబస్సెరుగని గ్రామాలు 120కి పైగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయా



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్

ప్రాంతాల ప్రజలు ఆటోలు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. ఉచిత బస్సు పథకం అమలులోకి వస్తే నష్టాల కారణంగా ఆయా గ్రామాలకు ప్రైవేటు వారు వెళ్లరు. ఈ క్రమంలో తమ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాల్సిందే అంటూ ఆయా గ్రామాల ప్రజలు తిరుగుబాటుకు దిగే అవకాశం లేకపోలేదు. ఈ విషయంపైనా ఆర్టీసీ అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది. సర్కారు పెద్దలెక్కడో ఉంటారని, క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తితే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఊపిరి పోసిన వైఎస్ జగన్..

ఆర్టీసీని నష్టాల బారి నుంచి బయట పడేసేందుకు గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశారు. ఉద్యోగులకు జీతాలు, అలవెన్సులకు నెలకు రూ.300 కోట్లు అవసరమని గుర్తించి ఏడాదికి రూ.3,600 కోట్ల భారం పడినా మాటకు కట్టుబడ్డారు. పెద్ద మొత్తంలో సంస్థకు భారం తగ్గించడంతో ఆర్టీసీ కొంత మేర ఊపిరి పీల్చుకుంది. ఈ క్రమంలోనే కూటమి సర్కారు ఉచిత బస్సుకు తెరతీయడంతో మళ్లీ ఆర్టీసీ అగాథంలోకి పడిపోతుందని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నిండా ముంచిన వర్షాలు



కణేకల్లు మండలం గరుడచేడులో నీట మునిగిన వేరుశనగ పంట



బొమ్మనహాళ్: వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ పంటను చూపుతున్న బాధిత రైతు కుటుంబీకులు

కణేకల్లు/బొమ్మనహాళ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కణేకల్లు మండలంలోని ఎన్.హనుమాపురం, సొల్లాపురం, హనకనహాళ్ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నాగేపల్లి వంకకు భారీగా వరద వచ్చింది. ఈ క్రమంలోనే వంక పక్కనే ఉన్న గరుడచేడు రైతుల వేరుశనగ పంట పొలాల్లోకి నీరు చేరాయి. పొలాలు చెరువుల్లా మారాయి. 15 రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న నేపథ్యంలో ఇలా జరగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సుమారు 200 ఎకరాల్లో పంట దెబ్బతిందని చంద్రశేఖర్, కురుబ వెంకటేశులు, కురుబ కాడెప్ప, గోపాల్, వెంకటరాముడు, బెస్త గోవింద రాజులు, గంగాధర, కృష్ణతోపాటు మరో 30 మంది వాపోయారు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని విలపిస్తున్నారు.

- బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి క్రాస్‌కు చెందిన పరమేశ్వరప్ప అనే కౌలు రైతు 6 ఎకరాల్లో బోరు కింద వేరుశనగ పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.60 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. ఇటీవల వేరుశనగ చెట్లు పీకి పొలంలో ఆరబెట్టాడు. అయితే, ఇదే సమయంలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడంతో పొలంలో నీరు నిలిచి వేరుశనగ కాయలకు మొలకలు వచ్చాయి. దీంతో పరమేశ్వరప్ప లబోదిబోమంటున్నాడు. కాయలు బూజుపట్టి, పశుగ్రాసం కూడా దక్కలేని పరిస్థితి ఉందని వాపోయాడు. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

28 మండలాల్లో వాన

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వరుణుడి ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 28 మండలాల పరిధిలో 5.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 21 మి.మీ, గుంతకల్లు 20.2 మి.మీ నమోదు కాగా మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం కురిసింది. కాగా రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

క్లుప్తంగా

రీ-సర్వే పనులు పూర్తవ్వాలి

- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: భూముల రీ-సర్వేకు సంబంధించి మూడో దశలో పెండింగ్ లో ఉన్న గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని చెప్పారు. రెవెన్యూ, రీ-సర్వే తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్‌డీఓలు, తహసీల్దారులు, రీసర్వే డీటీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. రెవెన్యూ సమస్యలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. మూడో దశలో పెండింగ్‌లో ఉన్న 250 గ్రామాల్లో ఈ నెల 20వ తేదీలోపు గ్రామ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అవే గ్రామాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ 15 తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వేకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు చౌక దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ ఎ.మలోల, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, విభాగాల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో రాణించిన కోగటం హనీష్



అనంతపురం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో అనంత బ్యాటర్ కోగటం హనీష్ వీరారెడ్డి అద్భుత సెంచరీతో అజేయంగా నిలిచాడు. విశాఖ సింహాద్రి వారియర్స్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహిస్తున్న వీరారెడ్డి ఏపీఎల్ చరిత్రలోనే తొలి ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేయడం విశేషం. కేవలం 60 బంతుల్లో 104 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 8 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి.

వీడని బాధ్యతారాహిత్యం

ఆరోగ్య శాఖ, బోధనాస్పత్రిలో అధికారుల ఇష్టారాజ్యం

- సీజ్ చేసిన ఆస్పత్రిని తెరిచినా నిద్ర వీడని డీఎంహెచ్‌ఓ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్
- ప్రొఫెసర్లు విధులకు డుమ్మా కొడుతున్నా పట్టించుకోని ఏఎంసీ ప్రిన్సిపాల్
- మంత్రి సత్యకుమార్‌కు పట్టని ప్రజారోగ్యం



అనంతపురం మెడికల్: ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న జిల్లా వైద్య రంగంలో ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం ప్రజలకు శాపంగా మారింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, బోధనాస్పత్రిలో కీలక అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన పలువురు ప్రజారోగ్యం జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు పట్టడం లేదని విమర్శలు చేస్తున్నారు.

నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం

జిల్లా కేంద్రంలో గతంలో సీజ్ చేసిన ప్రైవేట్ ఆస్పత్రిని అనధికారికంగా తెరిచి రోగులకు చికిత్సలు అందజేస్తున్నా.. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓ గర్భిణి ప్రాణాలు కోల్పోతే తప్ప డీఎంహెచ్‌ఓ మేల్కొనకపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్.. లావణ్య పేరుపై తన ఆస్పత్రిలో ఓ మహిళకు చేసిన శస్త్రచికిత్స విఫలం కావడంతో ఏడాది క్రితమే కలెక్టర్ ఆదేశాలతో ఆ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ సీజ్ చేశారు. తన భార్య డెంటల్ వైద్యురాలని, ఆ ఆస్పత్రిని తెరుచుకుంటానని తరచూ ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ డాక్టర్ రమణ నాయక్ అప్పట్లో తిరిగారు. ఆ తర్వాత మూతపడిన లావణ్య ఆస్పత్రిని తెరిచి శ్రీకృప పేరుతో నడిపారు. ఇటీవల బీకేఎస్ మండలం చెదళ్లకు చెందిన గర్భిణి రాధమ్మ(29) ప్రాణం పోయాక మూత పడిన ఆస్పత్రిని తెరిచిన వైనం వెలుగు చూసింది. పర్యవేక్షణ మరచిన డీఎంహెచ్‌ఓ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తీరూ ఇష్టారాజ్యంగా మారిందనే విమర్శలున్నాయి. గత నెలలో తాను నిర్వహిస్తున్న మేడా నర్సింగ్ హోంలో అడ్మిట్ చేసుకున్న ఉరవకొండ ప్రాంతానికి చెందిన రాజేష్ అనే 22 ఏళ్ల యువకుడిని తర్వాత జీజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందజేయించారు. అయితే ఆ యువకుడి మృతితో కుల సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. ఇటీవల జీజీహెచ్‌లో స్ట్రెచర్ అందుబాటులో లేక బెళగుప్ప తండాకు చెందిన మధునాయక్(23) మృతి చెందిన విషయం కలకలం రేపింది. తన సొంత ఆర్థో విభాగానికి సంబంధించిన వైద్యులు పట్టపగలే విధులకు డుమ్మా కొడుతున్నా డాక్టర్ ఆత్మారాం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బర్న్స్ వార్డును అనస్తీషియా విభాగానికి కేటాయించి విమర్శలకు తావిచ్చారు. ప్రధానంగా ఆస్పత్రిలో ఓ వైద్య విద్యార్థిని దోషిగా చేస్తూ ఆస్పత్రి గ్రూపులో ఏకంగా సదరు విద్యార్థి పేరును పోస్ట్ చేయడం కలకలం రేపింది. విద్యార్థి భవిష్యత్తును ఏ మాత్రం ఆలోచించకుండా పేరును ప్రస్తావించి పరువు తీయడం ఎంత వరకు సమంజసమని వైద్య విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ప్రిన్సిపాల్ తీరూ అంతంతే

ఇటీవల అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ) ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ షారోన్ సోనియా పనితీరు కూడా అంతంత మాత్రమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోధనాస్పత్రి వైద్యులు కనీసం సమయపాలన పాటించేలా కూడా ఆమె చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సిన వైద్యులు.. అలా వచ్చి తమ వాహనాలు కూడా దిగకుండా వైద్య కళాశాల ఎదుటనే తమ మొబైల్‌లో బయోమెట్రిక్ అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారు. అనంతరం వారికి తీరికైనప్పుడు విధులకు హాజరవుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ప్రజలు.. జిల్లా వైద్య రంగాన్ని బాగుపరిచే వారెవ్వరూ లేరా అంటూ ప్రశ్నిస్తున్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం: కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలోని 'స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిసియన్'లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఎస్సీ (హెచ్‌ఏ అండ్ హెచ్‌ఏ) మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం పైబడి మార్కులు సాధించిన వారు అర్హులు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ కోర్సు, సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ (సీఎఫ్‌బీఎస్) కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. కోర్సులు పూర్తయిన తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు www.sihmtpt.org వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు, లేదా 97013 43846, 91005 58006, 97004 40604లో సంప్రదించవచ్చు.

వడ్ల రాజమ్మ దేహదానం



వడ్ల రాజమ్మ (ఫైల్)

అనంతపురం మెడికల్: మరణానంతరం వైద్య కళాశాలకు దేహదానాన్ని చేయడం ద్వారా మానవ శరీర నిర్మాణంపై వైద్య విద్యార్థుల అభ్యాసనకు దోహదపడుతుందని అనంతపురంలోని నిర్మలానంద నగర్‌లో నివాసముంటున్న తెలుగు వెలుగు సాహితీ సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అన్నారు. ఈ నెల 12న ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఆయన భార్య, విశ్రాంత అంగన్‌వాడీ టీచర్ వడ్ల రాజమ్మ మృతి చెందింది. దీంతో బుధవారం సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియాకు వడ్ల రాజమ్మ మృతదేహాన్ని ఆయన అప్పగించి, మాట్లాడారు. ఈ సందర్భంగా టీవీ రెడ్డికి ప్రశంసాపత్రాన్ని డాక్టర్ షారోన్ సోనియా అందజేశారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు మృతదేహాల అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తరిమెల అమరనాథ్‌రెడ్డి, గురునాథ్, సలీం, జూటూరు షరీఫ్, విజయసాయి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- 31 ద్విచక్ర వాహనాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

పెనుకొండ: ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి 31 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. దుద్దేబండ క్రాస్ వద్ద సీఐ రాఘవన్ పర్యవేక్షణలో కియా ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది బుధవారం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన పెనుకొండ మండలం మునిమడుగుకు చెందిన ఓబన్న గారి వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో వాహనాల అపహరణ విషయం బయటపడిందన్నారు. దీంతో నిందితుడు తెలిపిన మేరకు హరిపురం వద్ద ఓ రేషం గ్రెనైజ్ సెంటర్‌లోని పాడుబడిన రూంలో భద్రపరిచిన 31 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీటి విలువ రూ. 18.60 లక్షలు ఉంటుందన్నారు. కాగా, సెల్‌ఫోనప్ప, డ్రిప్‌వైర్లు అపహరించిన కేసుల్లో ధర్మవరం, అనంతపురం రైల్వే పీఎస్, కొత్తచెరువు పీఎస్ పరిధిలో వినోద్‌పై కేసులు ఉన్నాయన్నారు. జల్సాలకు అలవాటు పడి అనంతపురంలో 8, కదిరిలో 6, కర్ణాటకలోని పావగడలో 5, కర్నూలు జిల్లా డోన్‌లో 3, తిరుపతిలో 3, ధర్మవరంలో 2, కళ్యాణదుర్గం, పాకాల, రొద్దం, ముదిగుబ్బలో ఒకటి చొప్పున మొత్తం 31 మోటార్ సైకిళ్లు అపహరించినట్లుగా వినోద్ అంగీకరించాడన్నారు. అపహరించిన వాహనాల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ హీరో హోండా కంపెనీకి చెందినవే కావడం గమనార్హం అన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్, క్రైమ్ సిబ్బంది నాగరాజు, మారుతి, తదితరులను ఎస్పీ రత్న అభినందించారు.

పరారీలో రైస్ మిల్లు ఓనర్

- మూడు వాహనాల డ్రైవర్ల అరెస్ట్
- 271 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

యాడికి: టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని మిల్లులో డంప్ చేసి బెంగళూరుకు తరలించేందుకు సిద్ధమైన యాడికిలోని రైస్ మిల్లు ఓనర్ బలరాముడుతో పాటు, మూడు వాహనాల డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు బలరాముడు పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. యాడికి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ ఈరన్న, సీఎస్‌డీటీ మల్లేసు వివరించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి అందించిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన యాడికి సీఐ ఈరన్న, సిబ్బంది, సీఎస్‌డీటీ మల్లేసుతో కలసి ఈ నెల 10న తెల్లవారుజామున 4 గంటలకు లారీ, బొలెరో, ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం వాహన డ్రైవర్లు ఇచ్చిన సమాచారంతో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి అనుమతులు తీసుకుని రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో యాడికిలోని బలరాముడు రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టారు. అక్కడ టన్నుల కొద్దీ రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. మొత్తం 271 టన్నుల రేషన్ బియ్యాన్ని మూడు రోజులుగా 10 లారీల ద్వారా గుంతకల్లులోని బఫర్ గోదాముకు తరలించారు. అనంతరం తహసీల్దార్ ప్రతాపరెడ్డి, పెద్ద మనుషులతో కలిసి బలరాముడు రైస్ మిల్లును సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రైస్ మిల్లు ఓనర్ బలరాముడితో పాటు వాహన డ్రైవర్లు తాడిపత్రికి చెందిన మసూద్ వలి, యాడికి మండలం కేశవరాయుని పేటకు చెందిన గంగాధర్, నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన ఖాసీంవలిపై కేసు నమోదు చేశారు. వీరిలో పట్టుబడిన ముగ్గురు వాహన డ్రైవర్లను బుధవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో బలరాముడు కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని పారిశ్రామికవాడ సమీపంలో బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన 157 బస్తాల్లోని 78.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట కసాపురం ఎస్‌ఐ టీపీ వెంకటస్వామి ఉన్నారు. బియ్యాన్ని డంప్ చేసిన వారు ఎవరనే విషయంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లి, బుడిమేపల్లి తదితర గ్రామాల్లో ఉన్న ఎస్సీ కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ బ్రహ్మసముద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ధర్నా చేపట్టారు. చెలిమేపల్లిలోని ఎస్సీ కాలనీలో కరెంటు స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇటీవల గాలి వానకు కరెంటు తీగలు తెగిపడటంతో ఓ పెంపుడు కుక్క మృతి చెందిందన్నారు. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తీగలు తెగి కింద పడుతున్నాయని, ఇలా జరిగిన ప్రతిసారీ కాలనీ వాసులంతా చందాలు వేసుకుని మరమ్మతులు చేయించుకుంటున్నారని వాపోయారు. కాలనీల్లో ఇలాంటి అగచాట్లు ఇంకా ఎన్నాళ్లు భరించాలని ఆవేదనతో విద్యుత్ అధికారుల వద్ద మొర పెట్టుకునేందుకు వస్తే మధ్యాహ్నం 12 గంటలైనా ఒక్కరూ కూడా రాలేదని మండిపడ్డారు. దీంతో వినతి పత్రాన్ని కార్యాలయం తలుపునకు అతికించి నిరసన వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

'అనంత' ఎమ్మెల్యే వసూళ్లకు హద్దేదీ?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



అనంతపురం అర్బన్: జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయని, స్వయానా టీడీపీ ఎమ్మెల్యేనే అక్రమాలకు ఊతమిస్తూ సాగిస్తున్న వసూళ్లకు హద్దనేది లేకుండా పోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అనంతపురంలోని కనకదాస ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనంతపురం నగరంలో దౌర్జన్యాలు, బెదిరింపులు, కబ్జాలు, అడ్డగోలు అవినీతి పెరిగిపోయాయన్నారు. ఈ అక్రమాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. 'లే అవుట్‌లు వేస్తే ఎమ్మెల్యేకి డబ్బులు ఇవ్వాలి. మాల్ ఓపెన్ చేస్తే డబ్బులివ్వాలి. బ్రాందీ షాపులన్నీ ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. చికెన్ సెంటర్ల నిర్వహణకూ డబ్బు ఇవ్వాలి. చివరికి బుడబుక్కల వారి భూమి కూడా తనదే అనే స్థాయికి ఎదిగారు' అంటూ ధ్వజమెత్తారు. నగరంలో వాణిజ్య దుకాణదారులనూ వదిలిపెట్టడం లేదని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఏ కార్యాలయంలోకి వెళ్లినా అవినీతికి అడ్డులేకుండా పోయిందన్నారు. అనంత రాజకీయ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఏనాడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్రంలోని విలువైన భూములను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు కూటమి ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం అన్యాయమన్నారు. టూరిజం శాఖ పరిధిలోని విలువైన ఆస్తులను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల దిగజారుడుతనం పరాకాష్టకు చేరుకుందనేందుకు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణనే నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను ఆపకుండా మిట్టల్‌కు ఊడిగం చేస్తూ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు అనుమతులు, రాయితీలు ఇవ్వాలంటూ కేంద్రం వద్ద పైరవీలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

'అనంత' బస్టాండులో అరాచకం

- గంజాయి మత్తులో వృద్ధుడిపై దాడి

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. బుధవారం వేకువజామున 1.30 సమయంలో ఆర్‌ఎం కార్యాలయం వైపుగా ఉన్న హోటల్ వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు అక్కడే ఉన్న 60 ఏళ్ల వయసున్న వృద్ధుడిపై అకారణంగా దాడి చేసి జేబులో ఉన్న నగదు లాక్కొన్నారు. ముఖంపై పిడిగుద్దులు కురిపించడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మత్తులో ఉన్న యువకులను అడ్డుకునే సాహసాన్ని ఎవరూ చేయలేకపోయారు. అదే సమయంలో అల్పాహారం కోసం అక్కడకు చేరుకున్న కొందరు యువకులు.. దుండగులను ప్రశ్నించడంతో వారిపై తిరగబడే ప్రయత్నం చేశారు. దీంతో యువకులు మూకుమ్మడిగా గంజాయి బ్యాచ్‌పై దాడికి ప్రయత్నించడంతో ద్విచక్ర వాహనంపై ఉడాయించే ప్రయత్నం చేశారు. ఈ లోపు ఓ యువకుడిని బంధించి దేహశుద్ధి చేశారు. ఉడాయించిన యువకుడు కాసేపటి తర్వాత అక్కడకు చేరుకుని తన సహచరుడిని విడిచిపెట్టాలంటూ బెదిరింపులకు దిగాడు. ఆ సమయంలో అతన్ని కూడా పట్టుకుని దేహశుద్ధి చేస్తూ ఆరా తీయడంతో గంజాయి సేవించినట్లు అంగీకరించారు. అనంతరం మత్తులో ఉన్న యువకులను బస్టాండ్‌లోని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. కాసేపటి తర్వాత మత్తులో ఉన్న యువకులను పోలీసులు వదిలిపెట్టేశారు. వారి ద్విచక్ర వాహనాన్ని సైతం అప్పగించారు. గంజాయి బ్యాచ్ దాడిలో గాయపడిన వృద్ధుడు తన వివరాలు పోలీసులకు తెలిపి రక్తగాయాలతో ఇంటికి వెళ్లి పోయాడు. కాగా, దాడికి పాల్పడిన యువకులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా పోలీసులు వదిలిపెట్టిన తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

సీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్ట్‌లన్నీ పూర్తయితేనే రాయలసీమ సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. ఇందుకు గాను రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని చెరువులన్నింటినీ అనుసంధానం చేయాలన్నారు. హెచ్చెల్సీని ఆధునికీకరించాలన్నారు. 11 టీఎంసీల నీరు నిల్వ చేసేలా పీఏబీఆర్‌ను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు రామ్‌కుమార్, శ్రీనివాసులు, అప్పిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, రామకృష్ణారెడ్డి, శేషాద్రి రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాజకీయ రంగు పులమొద్దు

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



జేడీఏను నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, చంద్రకుమార్ (చిత్రంలో) ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: రైతులకు రాజకీయ రంగు పులిమి సంక్షేమాన్ని అందకుండా చేయడం దారుణమని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత-సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం నిర్వహించిన స్థాయీ సంఘం-1, 2, 3, 4 5, 6, 7 సమావేశాలకు గిరిజమ్మ అధ్యక్షత వహించారు. తొలుత వ్యవసాయ శాఖపై చర్చ ప్రారంభం కాగానే యూరియా కొరతపై అధికారులను గిరిజమ్మ నిలదీశారు. నాసిరకం విత్తనాలు, ఎరువుల విక్రయాలపై ఎందుకు దృష్టి సారించలేకపోయారంటూ ప్రశ్నించారు. అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, చెన్నేకొత్తపల్లి, నల్లమాడ జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, భాస్కర్, గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి సైతం వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో రైతుకు మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తే.. అదే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలను కొందరికి మాత్రమే జమ చేసి మిగిలిన వారికి మొండి చెయ్యి చూపిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ముద్రవేసి రైతులకు అన్యాయం చేయడం భావ్యం కాదన్నారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఉచితంగా ఇచ్చే వేరుశగన కిట్లను అధికారులు అమ్ముకున్నారంటూ డి.హీరేహళ్ జెడ్పీటీసీ సభ్యురాలు హసీనాభాను ఆరోపించారు.

తల్లికి వందనం అమలులో వంచన చేస్తారా?

విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని జెడ్పీటీసీలు వేదాంతం నాగరత్నమ్మ, భాస్కర్, చంద్రకుమార్ ఆరోపించారు. ఇప్పటి వరకూ తల్లికి వందనం అమలు వివరాలు ఇవ్వాలని అడగ్గా విద్యా శాఖ అధికారులు చేతులెత్తేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం చాలా దారుణంగా ఉంటోందని, పిల్లలకు పురుగులు పడిన, ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు వడ్డించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశానికి ఆర్‌ఐఓ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను ఆయా శాఖాధిపతులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరారు. చిలమత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో తాగునీటి కొరతతో విద్యార్థులు అల్లాడిపోతున్నారని సభ దృష్టికి జెడ్పీటీసీ సభ్యురాలు అనూష తెచ్చారు. సమావేశంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ వేగవంతం చేయాలి

- ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశం



వీసీలో పాల్గొన్న జిల్లా ఏపీఎంఐపీ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు, ఓఎస్‌డీ ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం వారు విజయవాడ నుంచి ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ బీసీ ధనుంజయ, ఎంఐ ఇంజనీర్లు, కంపెనీ డీసీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రస్తుత 2025-26లో 18 వేల హెక్టార్లు టార్గెట్ కాగా ఇప్పటి వరకూ 2,522 హెక్టార్లకు మాత్రమే రైతులకు మంజూరు చేయగా, ఇన్‌స్టాలేషన్ల ప్రక్రియ తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పీడీ వివరణ ఇస్తూ... మరో 2 వేల హెక్టార్లకు మంజూరు చేయడానికి బీఓక్యూ, బీఎంసీ, రైతు వాటా పూర్తయిందని, వారం రోజుల్లోనే అడ్మినిస్ట్రేటివ్ శ్యాంక్షన్ తీసుకుని రైతులకు మంజూరు ఉత్తర్వులు ఇస్తామన్నారు. సీనియార్టీ వారీగా రిజిస్ట్రేషన్లను తీసుకుని ప్రాథమిక పరిశీలన చేపట్టి అర్హత జాబితా ప్రకారం మంజూరు ప్రక్రియ చేపట్టాలని కమిషనర్ సూచించారు. పరికరాలను త్వరితగతిన సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అదే సందర్భంగా నాణ్యత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ డీసీఓలను ఆదేశించారు. గతేడాదికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిని వారం లోపు పూర్తి చేయాలన్నారు. వారం వారీ టార్గెట్లు నిర్దేశించుకుని మంజూరు ప్రక్రియ కొనసాగించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

టీనేజీ ప్రెగ్నెన్సీతో దుష్పరిణామాలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: టీనేజీ ప్రెగ్నెన్సీతో తలెత్తే దుష్పరిణామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. టీనేజీ ప్రెగ్నెన్సీల నియంత్రణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. బుధవారం వివిధ పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరైన వయస్సులో వివాహం చేయాలన్నారు. ప్రతి వైద్యాధికారి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధిగా ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, 104 సంచార వైద్య సేవల కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీల్లో అధిక సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు.

'అనంత చరిత్రను అద్భుతంగా చిత్రీకరించారు'

అనంతపురం కల్చరల్: రచయిత, దర్శకుడు గిరిధరరాయ్ నిర్మించిన 'అనంతపురం చరిత్ర'ను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారని బుల్లి తెర నటుడు డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక సాయినగర్‌లో అనంతపురం చరిత్ర లఘుచిత్రాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. శతాబ్దాల అనంత చరిత్రలో ఎన్నో కీలక ఘట్టాలున్నాయన్నారు. అందరికీ అర్థమయ్యే రీతిలో దర్శక నిర్మాతలు అద్భుతంగా తెరకెక్కించారని కొనియాడారు. 1791 ప్రాంతాల నుంచి స్వాతంత్ర్య కాంక్షతో నాయకులు త్యాగనిరతిని సినిమాలో చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురుషోత్తమ రెడ్డి, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ డీన్‌గా ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి

అనంతపురం: ఎస్కేయూ అకడమిక్ డీన్‌గా ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి నియమితులయ్యారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ రమేష్ బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలిసారిగా అకడమిక్ డీన్‌ను నియామకం చేశారు. ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా కృష్ణకుమారి గతంలో పని చేశారు. ఎస్కేయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు ప్రస్తుతం ఉన్నారు. అకడమిక్ అంశాల్లో రెక్టార్ కీలకం. రెక్టార్ ఉన్నప్పటికీ.. తాజాగా అకడమిక్ డీన్ నియామకంపై వర్సిటీ వర్గాల్లో పలు వాదనలు వినిపిస్తున్నాయి.

పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

అనంతపురం సెంట్రల్: పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ విజయలక్ష్మి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ కో–ఆర్డినేటర్ కొండప్ప సూచించారు. బుధవారం రాణినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా మంది పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు అవుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్లలో పిల్లలు ఏం చూస్తున్నారో ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా సున్నితంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ లక్ష్మీనరసమ్మ, సంస్థ ప్రతినిధులు సంజు, వర్ష, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైసల్.. పోస్టు ఫైనల్



- జీజీహెచ్‌లో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టు ఖాళీ
- అధికారులను ప్రసన్నం చేసుకుంటేనే ఉద్యోగం
- 14 రోజులవుతున్నా భర్తీ చేయని అధికారులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టుకు ముడుపులు నిర్ణయించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. గత నెలాఖరున చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా ఉన్న ఓ సీనియర్ ఫార్మసిస్టు ఉద్యోగ విరమణ చేశారు. కాగా అప్పటి నుంచి ఆ పోస్టును భర్తీ చేయడంలో సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆస్పత్రి పాలనను ఎక్కడికక్కడ స్తంభింపజేసేలా అధికారులు వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

అత్యంత కీలకమైన పోస్టు..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టు ఉంది. రోగులకు మందులు సరఫరా చేయడంతో పాటు మందులెక్కడ కూడా అవకతవకలకు ఆస్కారం లేకుండా కచ్చితంగా స్క్రూటినీ చేసే కీలకమైన పోస్టు ఇది. ఫార్మసీ విభాగంలో 11 మంది రెగ్యులర్, 9 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఫార్మసీలో మందులతో పాటు సర్జికల్ ఐటమ్స్, రోగులకు సంబంధించి పల్స్ ఆక్సీమీటర్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్, ఐసీయూ మంచాలు, తదితర రూ.లక్షల విలువ చేసే పరికరాలను అవసరానికి అనుగుణంగా వార్డులకు పంపాల్సి ఉంటుంది. అదే విధంగా తలసీమియా పిల్లలకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు, మెడిసిన్, సర్జికల్, గైనిక్ విభాగానికి సంబంధించిన ఖరీదైన ఇంజెక్షన్లను రోగులకు ఎప్పటికప్పుడు అందించాల్సి ఉంటుంది. కాగా మందులు ఎన్ని వెళ్లాయో.. పక్కాగా రోగులకు అవి అందుతున్నాయా? లేదా అని ఎప్పటికప్పుడు చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ చూసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటుగా జీఎస్‌టీయూ వద్ద ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి రోజూ రూ.లక్షలు విలువ చేసే మెడిసిన్ (400లకు పైగా రకాలు) వస్తుంది. మందులు కొరత ఉన్నప్పుడు అత్యవసరంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వివిధ వార్డుల్లో మందుల కొరతతో రోగులతోనే డబ్బులు పెట్టించే దారుణమైన పరిస్థితులను సర్వజనాస్పత్రిలో చూస్తున్నాం. ఇటువంటి కీలకమైన పోస్టు దక్కాలంటే ఫార్మసిస్టులు భారీగా చెల్లించుకోవాలని తెలుస్తోంది. పలువురు అధికారులను ప్రసన్నం చేసుకుంటేనే ఈ పోస్టు కేటాయించే పరిస్థితి ఉండటంతో రెండు వారాలుగా ఎవరికి ఈ పోస్టు కేటాయించలేదు. అదేవిధంగా ఆస్పత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తడంతో ఫార్మసిస్టులు కూడా ఎవరికైనా ఇచ్చుకోనివ్వండనే ధోరణిలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

కలెక్టర్ ప్రేక్షకపాత్ర

ఆస్పత్రిలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత కీలకమైన పోస్టుల కేటాయింపులో పలువురు అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. వాస్తవంగా ఇటీవల ఆ ఇద్దరు అధికారులు కుమ్మక్కై తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలపై కలెక్టర్ ఆరా తీస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

మెడికల్ ఆఫీసర్‌గా ఆర్థో అసోసియేట్..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మరీ విడ్డూరంగా ఓ అసోసియేట్‌కు స్టోర్స్ మెడికల్ ఆఫీసర్ పోస్టును కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే ఆర్థో ఓపీలో వైద్యులు ఉండకుండా మధ్యాహ్నం 12 గంటలకంతా పరుగులు పెడుతున్నారు. ఇటువంటి తరుణంలో కొద్దో గొప్పో పని చేసే వారిని తీసుకువచ్చి మెడికల్ ఆఫీసర్‌గా నియమించి రోగులకు కనీస వైద్యం అందకుండా చేస్తున్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉంటే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెడికల్ ఆఫీసర్ పోస్టును కేటాయించి, పనులు చేసే వైద్యులను వారి స్థానాల్లో ఉంచితే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

'కార్పొరేట్ కంపెనీలను రానీయొద్దు'



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడురూరల్: కార్పొరేట్ సంస్థల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీలను రానీయొద్దన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత వాణిజ్య ఒప్పందాలను విరమించుకుని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన మహా 'క్విట్ ఇండియా' ఉద్యమం 83వ వార్షికోత్సవం సందర్భంగా, 'బహుళ జాతి సంస్థలు భారత్ విడిచి వెళ్లిపోవాలని, బడా కార్పొరేటు కంపెనీలు వ్యవసాయం విడిచి వెళ్లిపోవాలనే నినాదాలతో మోదీ, ట్రంప్ బొమ్మలను దహనం చేశామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, ఉపాధ్యక్షులు రామకృష్ణ, నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికులు ధర్నా చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే ఆటోలకు బాడుగలు తగ్గి కార్మికుల బతుకులు దుర్భరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం వాహనమిత్ర కింద రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు నష్టదాయకమైన జీఓ 21ని రద్దు చేయాలన్నారు. ఆటో కార్మికులను ఆదుకునే చర్యలను ప్రభుత్వం చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి రామిరెడ్డి, వెంకట నారాయణ, ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆజాం బాషా, టి.శ్రీనివాసులు, కోశాధికారి ఆదినారాయణ, మహిళ విభాగం కన్వీనర్ స్వాతి, నాయకులు రామలింగారెడ్డి, రఘు, నాగరాజు, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిపై కత్తితో దాడి

అనంతపురం: నగరంలోని నాలుగో రోడ్డు వద్ద ఉన్న నేతాజీ స్కూల్ వద్ద బుధవారం ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు.. కురుగుంటకు చెందిన తస్లీమా బేగం భర్త నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమెకు ఇద్దరు బిడ్డలు. వీరు నాలుగో రోడ్డులోని నేతాజీ పాఠశాలలో చదువుతున్నారు. తస్లీమా బేగం మూడు సంవత్సరాలుగా దాదా ఖలందర్ అనే వ్యక్తి స్నేహపూర్వకంగా ఉంటున్నాడు. దీన్ని ఓర్చుకోలేక అలీ అనే వ్యక్తి దాదా ఖలందర్‌తో గొడవ పడి కత్తితో పొడిచాడు. గాయపడిన అతడిని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం క్రైం: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.భాస్కర నాయుడు మాట్లాడుతూ.. వేతన సవరణ అయిపోయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లూలుకు కేటాయించిన ఆర్టీసీ స్థలాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ డిపోను తరలించాలన్న ఆలోచన మానుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కూటమి సర్కారు ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ సూరిబాబు, చాంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలో కొల్హాపూరు మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. అర్చకుడు సుంకేశుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నవగ్రహ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠానంద మాతాజీ విచ్చేసి నాగుల ప్రాముఖ్యతను వివరించారు. కొల్హాపూరు మహాలక్ష్మికి సుగంధ సమేత అభిషేకాలు, అలంకార సేవలు, సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు.

వాణిజ్య ఒప్పందాలపై ఆగ్రహం



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద పత్రాలను దహనం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఒప్పందం పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారన్నారు. అమెరికా విధిస్తున్న సుంకాలతో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నాయకులు వెంకటరమణ, లతీఫ్, బీహెచ్ రాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, రాము, లక్ష్మీనారాయణ, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం



ఎంజీఎం కాలనీలో ఇళ్ల ముందు మురుగు ఇలా



సోమనాథ్ నగర్‌లో బ్రిడ్జి వద్ద అపరిశుభ్రత

అనంతపురం నగరంతోపాటు రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షం వస్తే చాలు ప్రధాన రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలుస్తోంది. అనంతపురంలో 377.367 కి.మీ సీసీ డ్రైన్స్, 12 కి.మీ పెద్ద మురుగు నీటి కాలువలు, 62.739 కి.మీ కచ్చా డ్రైన్స్ ఉన్నాయి. వీటితో పాటు మరువవంక, నడిమివంక పెద్ద కాలువలున్నాయి. అనంతపురంలోని నడిమివంకకు సంబంధించి ఎంజీఎం కాలనీ, జనశక్తినగర్, సోమనాథ్ నగర్, రంగస్వామి నగర్, రజక్‌నగర్, గౌరవ గార్డెన్, వడ్డే వారి కాలనీ, ఆజాద్ నగర్, 5,6వ రోడ్లు, మరువ వంకకు సంబంధించి సూర్యనగర్, సాయినగర్, వినాయకనగర్, భాగ్యనగర్, తదితర ప్రాంతాల్లో మురుగు ఇళ్లలోకి వచ్చే పరిస్థితి నెలకొంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మురుగునీరు తడకలేరు వంకలోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించకపోతే కొన్ని కాలనీలు మునిగిపోవడమే కాకుండా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే పరిస్థితి లేకపోలేదు. రాప్తాడులో నీలకంఠేశ్వర స్వామి కాలనీలో మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్వాసన వస్తోంది. రాప్తాడులో వైన్ షాపు వద్ద డ్రైనేజీకి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ముస్లిం మైనార్టీ కాలనీలో మురుగు పేరుకుపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇక రాప్తాడు మండలంలోని యర్రగుంట, బోగినేపల్లిలో డ్రైనేజీలు లేకపోవడంతో సీసీ రోడ్లపై మురుగు ప్రవహించింది. అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– రాప్తాడు/ అనంతపురం కార్పొరేషన్:




రాప్తాడులో వైన్ షాపు దగ్గర పూడుకుపోయిన మురుగు కాలువ



రాప్తాడు మండలం యర్రగుంటలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

విధులకు డుమ్మా



మరూరు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు యథేచ్ఛగా విధులకు డుమ్మా కొడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరూరు సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో డిజిటల్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన 8 శాఖల సిబ్బంది ఎక్కడికి వెళ్లారో ఎవరికి తెలియడం లేదు. 9 శాఖల అధికారుల్లో కూడా నాలుగు శాఖల అధికారులు మాత్రమే అటెండెన్స్‌లో సంతకాలు చేశారు. మిగిలిన శాఖల అధికారులు అటెండెన్స్‌లో సంతకాలు పెట్టలేదు. ఒక్క అధికారి అయితే ఈనెల 1వ తేదీ నుంచి సంతకాలు చేయకపోవడం గమనార్హం. సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అరాచకాలను బయట పెడతా: వైకుంఠం

అనంతపురం క్రైం: అనంతలో జరిగే అరాచకాలను ఆధారాలతో సహా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారాలోకేష్‌ను కలసి అందజేస్తానని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర చౌదరి అన్నారు. బుధవారం స్థానిక రాంనగర్‌లోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. నగరంలో జరుగుతున్న అరాచకాలపై పార్టీ పెద్దలు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలు, సమాజం బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేను నోరు విప్పితే.. అది పార్టీకి చెడ్డ పేరు తెచ్చినట్లవుతుందని తెలిపారు. అనంతలో ఎవరికి అన్యాయం జరిగినా వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన సాయినగర్‌లో అస్రా ఆప్టికల్స్ నిర్వాహకులను పరామర్శించారు. మీరు భయపడాల్సిన అవసరం లేదని అండగా ఉంటామన్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ జేడీగా డాక్టర్ టీవీ సుధాకర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సుధాకర్ ప్రస్తుతం ఉరవకొండ డివిజన్ డీడీగా పని చేస్తుండగా.. అదనంగా ఇన్‌చార్జ్ జేడీ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ జేడీగా ఉన్న డాక్టర్ జీపీ వెంకటస్వామి జూన్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. రెగ్యులర్ జేడీ నియమితులయ్యే వరకు సుధాకర్ ఇన్‌చార్జ్‌గా పని చేయనున్నట్లు ఆశాఖ వర్గాలు తెలిపాయి.

నాణ్యతకు మారుపేరు 'భారతీ సిమెంట్'



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

అనంతపురం సెంట్రల్: నాణ్యతకు, నమ్మకానికి మారుపేరుగా భారతీ సిమెంట్ నిలుస్తోందని కంపెనీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలో మాసినేని హోటల్‌లో ఇంజినీర్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీ సిమెంట్ పర్యావరణ పరిరక్షణకు ఎలా పాటుపడుతుందన్న అంశంపై కంపెనీ తయారు చేసిన పీపీసీ, అల్ట్రాఫాస్ట్ మన్నిక గురించి వివరించారు. ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల హెచ్ఓడీ రఘుబాబు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో కాంక్రీట్‌లో జరిగే నూతన ఆవిష్కరణను వివరించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ ప్రతినిధి మల్లికార్జున, టెక్నికల్ ఇంజనీర్ మోతిలాల్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, భారతీ సిమెంట్ డీలర్లు పాల్గొన్నారు.

జీతాలు వచ్చేలా చూడండి



ఖజానా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన పొజిషన్ ఐడీలు, కేడర్ స్ట్రెంత్‌లో ఉన్న లోపాలను సరి చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ ఖజానా అధికారి తిరుమల రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీ పొందిన చాలా మంది ఉపాధ్యాయులకు జీతాలు వచ్చే పరిస్థితి కనిపించలేదని వాపోయారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి జూన్, జూలై నెలల జీతాలు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు నాయకులు ఫణి భూషణ్, శ్యామ్ కుమార్, నాగభూషణం, నజురుల్లా తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో పిడుగుల నుంచి రక్షణ



పిడుగుపాటు భద్రతా రథాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: పిడుగుపాటు, మెరుపుల నుంచి రక్షణ పొందడానికి జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌ఓ మలోల సూచించారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఆవరణలో పిడుగుపాటు భద్రతా రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రథం జిల్లాలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో ఈనెల 14వ తేదీన, శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామంలో 15వ తేదీన, పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామంలో 16వ తేదీన, డీ హీరేహాళ్ మండలం దొడగట్ట గ్రామంలో 17వ తేదీన పర్యటిస్తుందన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డీటీ బాషా, సిబ్బంది శ్రీనాథ్‌బాబు, శ్రీతేజ, జిలాన్‌బాషా, మహమ్మద్ షఫీ, పవన్‌కుమార్, పురుషోత్తం, విశ్వనాథ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జయ చంద్రారెడ్డి

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివి ప్రస్తుతం విద్యుత్ శాఖలో పని చేస్తున్న పూర్వ విద్యార్థులు మంజునాథ్, నాగేంద్ర, చంద్రశేఖర్, వీరనారాయణ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రఘునాథ్, మహేష్, శ్రీకాంత్ తదితరులు 500 లీటర్ల ఆర్వో ప్లాంట్‌ను కళాశాలకు అందజేశారు. బుధవారం 1986–89 బ్యాచ్ విద్యార్థులు అందజేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రిన్సిపాల్ సి.జయ చంద్రా రెడ్డి ప్రారంభించారు.